క్లుప్తంగా

పండుగనాడూ పస్తులే..

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య కళాశాల పనిచేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వారికి ప్రతినెలా ఒకటి, రెండవ తేదీన జీతాలు ఠంఛనుగా వచ్చేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు నెలలుగా జీతాలు రాక పదిమంది అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. పండుగ పూట కూడా పస్తులు ఉండే పరిస్థితి. సిబ్బంది జీతబత్యాలను అధికారులకు పంపాల్సిన ఒక ఉద్యోగి వారిపట్ల కక్షసాధింపు చర్యలు దిగుతున్నట్లు వారు వాపోతున్నారు. అతను ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. నా వెనుక స్థానిక ఎమ్మెల్యే ఉన్నాడని బెదిరిస్తున్నారని ఒక అధ్యాపకుడు తెలిపారు. ఏపీ సృజనాత్మక సమితికి ఇన్‌చార్జిగా ఆగస్టు 15వ తేదీన ఏపీ టూరిజంలో డీడీగా పనిచేస్తున్న ఎ. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి నేటి వరకు కార్యాలయానికి రాలేదని చెబుతున్నారు. పండుగ నాడు పస్తులు లేకుండా జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

ఎస్ఆర్ శంకరన్ సేవలు మరువలేనివి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎస్ఆర్ శంకరన్ చేసిన కృషి మరువలేనిదని శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. సోమవారం అరండల్‌పేటలోని ఐక్యతా భవన్ ఐఏఎస్ ఎస్ఆర్ శంకరన్ 14వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. కమిటీ సభ్యులు శంకరన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ కోకన్వీనర్ ఆంధ్ర మాల్యాద్రి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుట్టి రాయప్ప, ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల సంఘం నాయకుడు కొండలరావు, దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, డీహెచ్‌పీఎస్ నాయకులు పి రాము, రాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలైన ఘటన సోమవారం భవానీపురం బోట్ ఏజెన్సీ ఎదురుగా గల విజయదుర్గా టింబర్ డిపో సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన షేక్ నాగుల్ షరీఫ్ భార్య కరీమున్నీషా, కుమారుడు సలామ్ గౌస్‌తో కలిసి యాక్టివాపై విజయవాడ ఆసుపత్రికి బయలుదేరారు. భవానీపురం బోట్ ఏజెన్సీ ఎదురుగా ఉన్న విజయవాడ దుర్గా టింబర్ డిపో వద్దకు చేరుకోగానే గొల్లపూడి నుంచి విజయవాడ వెళ్తున్న కారు వేగంగా వచ్చి వెనుక నుంచి యాక్టివాను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగుల్ షరీఫ్, కరీమున్నీషాలకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న నాగుల్ షరీఫ్ స్నేహితులు ఇరువురిని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్కినేని నటజీవితం ఆదర్శప్రాయం



విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నటజీవితం ఆదర్శప్రాయమని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో అక్కినేని శతజయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి, కళాకారులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ అక్కినేని తన నటనతో ఎందరో యువ నటులకు స్ఫూర్తిగా నిలిచారని వివరించారు. న్యాయవాది వేములు హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ అక్కినేని నటకీర్తి అజరామరం అన్నారు. కార్యక్రమంలో జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్, కొప్పుల ఆనంద్, శ్రీసత్య, నిడుమోలు రమాసత్యనారాయణ, డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు పాల్గొన్నారు. గాయకులు అక్కినేని నటించిన చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. నిర్వాహకులు గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

నేత్రపర్వంగా కూచిపూడి నృత్యాలు

విజయవాడ కల్చరల్: శరన్నవరాత్రులు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురం సీతారామ కల్యాణ మండపంలో సోమవారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇదిగో భద్రాద్రి, పలుకు తేనియ తల్లి, చక్కని తల్లికి ఛాంగ్‌భళా, అమ్మ రావమ్మా, వరములిచ్చే దేవతవు నీవే తదితర కీర్తనలకు చిన్నారులు నృత్యాలను అభినయించారు. యోచితా డాన్స్ అకాడమీ నిర్వాహకుడు వేదాంతం రామస్వామి మాట్లాడుతూ కూచిపూడి నాట్య సంప్రదాయాన్ని కాపాడుకోవాలని సూచించారు. భారతీరాఘవా నృత్య కేంద్రం విద్యార్థినీలు అపర్ణా ప్రసాద్ ఆధ్వర్యంలో నృత్యాలను ప్రదర్శించారు. నిర్వాహకులు చిన్నారులను సత్కరించారు.

దరఖాస్తులైనా తీసుకోండయ్యా..

- కలెక్టరేట్ సిబ్బందిని వేడుకున్న వరద బాధితులు
- తెరుచుకోని కలెక్టరేట్ గేట్లు, అర్జీలు స్వీకరించని వైనం
- ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తి పోసిన మహిళలు
- జగన్ ప్రభుత్వం ఉండి ఉంటే అన్నీ ఇంటికే వచ్చేవి



కలెక్టరేట్ గేటు మూసివేయడంతో సిబ్బందిని వేడుకుంటున్న వరద బాధితులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు బాధితులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరాశ ఎదురైంది. ప్రభుత్వ పరిహారం అందని బాధితులు దరఖాస్తు చేసుకునేందుకు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. తీరా అక్కడికి వచ్చిన తర్వాత కలెక్టరేట్ గేటు మూసేశారు. దరఖాస్తులు తీసుకోవడం లేదంటూ సిబ్బంది కరాఖండీగా చెప్పేశారు. మరి కాసేపటికైనా అధికారులు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తారేమోనని ఎండలోనే గేటు వద్ద ఆశగా ఎదురు చూశారు. ''ఎండన పడి వచ్చాం. పిల్లలతో ఇబ్బందులు పడుతున్నాం. 37 రోజులు దాటినా పరిహారం ఎటూ రాలేదు. కనీసం దరఖాస్తులైనా తీసుకోండయ్యా'' అంటూ బాధితులు కలెక్టరేట్ సిబ్బందిని వేడుకున్నారు.

నిరుత్సాహంతో వెనుదిరిగిన బాధితులు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ పరిహారం అందని వరద బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గత సోమవారం ప్రారంభమైన ఈ ప్రక్రియ శనివారం వరకు సాగింది. కొద్దిరోజులు టేబుల్స్ ఏర్పాటు చేసి మండలాల వారీగా దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత చెట్ల కింద డబ్బాలు ఏర్పాటు చేసి దరఖాస్తులో వాటిలో వేయమన్నారు. మరికొన్ని రోజులు గేట్లు మూసి వేసి.. బాధితులను రోడ్డుపై ఉంచి సిబ్బంది దరఖాస్తులు తీసుకున్నారు. అప్పటి నుంచి వేల సంఖ్యలో అర్జీలు వస్తున్నాయి. సోమవారం కలెక్టరేట్ గేట్లు పూర్తిగా మూసి వేశారు. లోపలకి ఏ ఒక్కరినీ అనుమతించలేదు. మండుటెండలో గేటు ఎదుటే నిల్చున్నారు. దరఖాస్తులు కూడా స్వీకరించకపోవడం, పైస్థాయి అధికారులు ఎవ్వరూ అక్కడ లేకపోవడంతో బాధితులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. కూటమి ప్రభుత్వ తీరుపై బాధిత మహిళలు దుమ్మెత్తి పోశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతిదీ ఇంటి వద్దనే అందించారు. ఏ పథకానికైనా వలంటీర్లే దరఖాస్తు చేసేవారు. ఈ ప్రభుత్వంలో కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు.

దరఖాస్తు కూడా తీసుకోలేదు



ఐదేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నా. వారం రోజులకు పైగా వరదనీటిలోనే ఉన్నాం. వరద తర్వాత పాపకు ఆరోగ్యం దెబ్బతిని 15 రోజులు ఆసుపత్రిలో ఉన్నాం. సర్వే వాళ్లు వచ్చి రాసుకున్నారు. జాబితాలో నా పేరు కూడా వచ్చింది. కానీ పరిహారం మాత్రం అందలేదు. పనులు మానుకొని కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. కలెక్టరేట్‌కు వస్తే గేటు వేసి దరఖాస్తు కూడా తీసుకోలేదు.

తిరుపతిరెడ్డి, ఊర్మిళానగర్

పరిహారం నమోదు చేయలేదు



అద్దె ఇంట్లో ఉంటున్నా. భర్త లేడు. ఇంటి ముందు చిన్న టీ కొట్టు పెట్టుకున్నా. వరదల్లో మొత్తం మునిగిపోయింది. సర్వే వాళ్లు వచ్చినప్పుడు నష్టం రాయమని అడిగాను. టీ కొట్టు లైసెన్స్ అడిగారు. ఇంటికి కూడా నష్ట పరిహారం రాయలేదు. మూడుసార్లు దరఖాస్తు చేశాను. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇప్పుడున్న ఇంటిలోనే పెన్షన్ అందుకుంటున్నాను. పూర్తిగా నష్టపోయాను.. ఆదుకోండి.

ప్రభావతి, రాజరాజేశ్వరిపేట

కాలుష్య రహిత నగరానికి చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సోమవారం ఆయా శాఖాధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన నగరంలో పచ్చదనం పెరుగుదల, నగర సుందరీకరణ, కాలుష్య నియంత్రణకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల అభివృద్ధి, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, అనధికార నిర్మాణాలు తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తీసుకున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి..

అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో ఎక్కువ మొక్కలను నాటాలని, అందుకు ప్రజలను భాగస్వాములను చేయాలని చెప్పారు. కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేలా నగర సుందరీకరణ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో వాయు కాలుష్యమే కాకుండా నీటిని కూడా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల అభివృద్ధి ద్వారా శుద్ధి చేస్తూ నీటి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో అనధికార నిర్మాణాలు జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయాలని, అధికారులందరూ వారి డివిజన్లలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, సూపరింటెండెంట్ ఇంజినీర్(వర్క్స్) పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వరరెడ్డి, ఏఎస్ఎన్ ప్రసాద్, సామ్రాజ్యం, చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ రామ్మోహన్, యూసీడీ పీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులు పూర్తిగా కోలుకునేలా చేయూతనందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. దాతల నుంచి చెక్కుల సేకరణకు కేటాయించిన సమయంలో సగం సమయం కూడా సహాయక చర్యలపై పెట్టకపోవడంతో.. 16 డివిజన్లు పూర్తిగా నీటమునిగాయన్నారు. ఎన్యుమరేషన్‌లో లోపాల కారణంగా సగానికి పైగా బాధితులు సాయం అందక మిగిలిపోయింది వాస్తవం కాదా..? అని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత వల్ల నేటికీ వీరంతా కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారని.. కేంద్రం ఇచ్చిన రూ. 1,036 కోట్ల నిధులు ఏమయ్యాయని అని ప్రశ్నించారు. మానవత్వంతో దాతలు అందించిన సహాయంలోనూ అంతులేని అవినీతి జరిగిందన్నారు. మొదటి ఐదారు రోజులు బాధితుల దగ్గరకే వెళ్లలేకపోయారని.. అలాంటప్పుడు ఆహారానికి ఏకంగా రూ. 368 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సహాయ శిబిరాలు ఏర్పాటు చేయకుండానే టెంపరరీ అకామిడేషన్ పేరుతో రూ. 1.45 కోట్లు దోచుకుతిన్నారని ధ్వజమెత్తారు. శానిటేషన్‌కు రూ. 52 కోట్లు ఖర్చు చేశామని చెప్పడమే తప్పు.. పారిశుద్ధ్య కార్మికులకు కనీసం భోజనాలు, వసతి కూడా ఏర్పాటు చేయలేదని దుయ్యబట్టారు. మరోవైపు కొవ్వొత్తులు, అగ్గిపెట్టెల పేరిట రూ. 23 కోట్లు ఖర్చు చూపడం హాస్యాస్పదమన్నారు. ఇవిగాక డ్రోన్ల పేరిట నొక్కేసింది మరో రూ. 2 కోట్లు అని పేర్కొన్నారు. చివరకు దాతలు అందించిన రూ. వందల కోట్ల సాయమంతా.. టీడీపీ కాంట్రాక్టర్ల జేబుల్లోకి చేరిందన్నారు. ఎన్యుమరేషన్ ప్రక్రియను మరలా పకడ్బందీగా చేపట్టి బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ తరపున పెద్దఎత్తున పోరాటం చేస్తామని మల్లాది విష్ణు హెచ్చరించారు.

ప్రత్యేక చిన్నారులకు వైద్య శిబిరం



ఆటల పోటీల్లో సెరిబ్రల్ పాల్సీ చిన్నారులతో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ సెరిబ్రల్ పాల్సీడే పురస్కరించుకుని అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం, ఆటల పోటీలు నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ బీవీ గురునాథ్ శర్మ ప్రత్యేక చిన్నారులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా చేయూత డైరెక్టర్ డాక్టర్ టీ కృష్ణకుమారి సెరిబ్రల్ పాల్సీడే గురించి వివరించారు. తల్లిదండ్రులు చిన్నారులను ఎప్పటికప్పుడు గమనించి ఏమైనా తేడా ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సెరిబ్రల్ పాల్సీ వచ్చినవారు మెరుగైన చికిత్స తీసుకోవడం ద్వారా మంచి జీవితం గడిపే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం సెరిబ్రల్ పాల్సీ బాధిత చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారులు వాకింగ్, బాల్‌గేమ్, చిత్రలేఖనంలో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

సచివాలయ బ్యాచ్ మొత్తం వైసీపీ వాళ్లే..

- వారం పదిరోజుల్లో మొత్తాన్ని పీకేయిస్తాను
- టీడీపీ మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య ఫోన్ సంభాషణ
- సోషల్ మీడియాలో ఆడియో వైరల్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'సచివాలయ బ్యాచ్ మొత్తం వైసీపీ వాళ్లే ఉన్నారు. ఏం చేస్తాం? ఒక పక్క నుంచి పీక్కుంటూ వస్తున్నాం. ఒకరా.. ఇద్దరా ఆపడానికి. వారం ఆగితే అందరిని రిమూవ్ చేస్తాం. వారం పదిరోజుల్లో మొత్తాన్ని తీసి పారనూకుతాం. వాళ్లిష్టమొచ్చినట్లు కొట్టుకుంటూ పోయారు. మనోళ్లకు రాలేదు. వాడి మీద ఫిర్యాదు చెయ్.. వాడి జాబ్ తీయించి పారనూకుతాను' అంటూ సచివాలయ ఉద్యోగుల గురించి పశ్చిమ నియోజకవర్గ టీడీపీ మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య ఆ పార్టీ కార్యకర్తతో చేసిన ఫోన్ సంభాషణ. ఇప్పుడది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 42వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త కిషోర్ మాజీ కార్పొరేటర్ రామయ్యకు ఫోన్ చేసి.. వరద నష్ట పరిహారం అందలేదని చెప్పాడు. ఫలానా వాళ్లకు రూ. 1.25లక్షలు పడ్డాయి. మన వాళ్లు మొత్తం కోల్పోయిన రూ. 3వేలు పరిహారం ఇచ్చారంటూ రామయ్యతో ఫోన్‌లో మాట్లాడాడు. టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి రూ. లక్ష, రెండు లక్షలు వేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఏమీ ఇవ్వలేదు. ఇదేం న్యాయమంటూ రామయ్యను అడిగాడు. దీంతో రామయ్య ఒక్కసారిగా.. సచివాలయ బ్యాచ్ మొత్తం వైఎస్సార్ సీపీ వాళ్లేనంటూ రెచ్చిపోయాడు. ఫోన్ సంభాషణతో నియోజకవర్గంలోని సచివాలయ ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ సంభాషణలో వాడిన బాష, సచివాలయ ఉద్యోగులను వాడు వీడు అంటూ మాట్లాడిన తీరుపై పలువురు మండిపడుతున్నారు. ఇలాంటి ఆడియోలు రికార్డు చేసి వాటిని వైరల్ చేయడం రామయ్యకు అలవాటేనని, సచివాలయ ఉద్యోగులంతా వైసీపీ వాళ్లేనంటూ బెదిరించి వారిని తన ఆధీనంలో పెట్టుకునే కుట్రలో భాగంగానే ఆడియో వైరల్ చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో వాళ్ల పార్టీ నాయకులు ఫోన్‌లో మాట్లాడిన సంభాషణల ఆడియోలు కూడా ఇలాగే వైరల్ అయ్యాయని నాయకులు చర్చించుకుంటున్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలు ఇవ్వండి

కలెక్టర్లను ఆదేశించిన సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ జయలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములకు సంబంధించిన వివరాల నివేదికను అందజేయాలని సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ జయలక్ష్మి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన వీసీలో పాల్గొన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినవి, చట్టాన్ని ఉల్లంఘించిన వాటి పూర్తి వివరాలను నివేదికలో స్పష్టంగా తెలియజేయాలని సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ వివరించారు. ఇప్పటికే సమర్పించిన వివరాలను పునః పరిశీలించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ జరిగిన భూముల వివరాలను నివేదికలో పొందుపరచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూ సేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న షేక్ వలీబాషా(60) వాంబేకాలనీలో తల్లి వద్ద ఉంటూ ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నున్న పోలీసులు తెలిపిన వివరాలు.. మనస్పర్థల కారణంగా వలీబాషా భార్య, పిల్లలతో విడిపోయి గతకొన్ని రోజులుగా తల్లితో ఉంటున్నాడు. ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి బయట నుంచి వచ్చి చూసి చుట్టుపక్కల వారి సాయంతో కిందకి దింపి చూడగా అప్పటికే వలీబాషా మృతిచెందాడు. మృతుడి తమ్ముడు అల్లాభక్షు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



వరద బాధిత దళిత మహిళలకు కిట్లు పంపిణీ చేస్తున్న దళిత స్త్రీ శక్తి నాయకులు



బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న దాతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు దళిత స్త్రీ శక్తి సహాయం అందించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని 15 మురికివాడలు, 5 గ్రామాల్లోని బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. సోమవారం విజయవాడ లెనిన్‌సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో బాధితులకు 10 వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. మొత్తం 650 మంది దళిత స్త్రీలకు కిట్లు అందజేసినట్లు దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడ్డడుగు వర్గాల ప్రజలు నివశించే ప్రాంతాలు రాబోయే రోజుల్లో ముంపునకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలు దళిత వర్గాలకు శాశ్వత జీవనోపాధికి తోడ్పడేవిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో దళిత స్త్రీ శక్తి కోఆర్డినేటర్ సత్య, రాష్ట్ర కోఆర్డినేటర్లు రోజా, దివ్య, చిరంజీవ చిట్స్ అధినేత టి.ఆదిరామ్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): వరద బాధితులకు పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో బియ్యం, నిత్యావసర వస్తువులను సోమవారం హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ వారు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు హెచ్‌ఎం డాక్టర్ మైనం హుస్సేన్ ద్వారా నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో దాతలు దినేష్, మోహన్, చైతన్య, దుర్గాప్రసాద్, ఓల్డ్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): పోలియో వ్యాధిగ్రస్తుడు తలకు గాయమై చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. నున్న పోలీసులు తెలిపిన వివరాలు, రాజీవ్‌నగర్‌కు చెందిన కరకట్ల రేవంత్(16) పోలియో వ్యాధిగ్రస్తుడు. హిమో ఫిలియా వ్యాధి కూడా ఉండటంతో తండ్రి విజయవాడ, గుంటూరులోని ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స చేయిస్తున్నాడు. ఈనెల 3వ తేదీన ఇంటి వద్ద బాత్‌రూమ్‌లో కుర్చీ నుంచి పడి తలకు గాయం అయ్యింది. తలకు బొప్పి కట్టడంతో గుంటూరు ప్రభుత్వాసుత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి హరిష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో గాయత్రీదేవి అలంకారం



దుర్గాపురంలో శ్రీమహాచండీ దేవిగా అమ్మవారు



మధురానగర్ మెయిన్ రోడ్డులో శ్రీ మహాచండీ దేవి అలంకరణలో..



శివరామకృష్ణ క్షేత్రంలో సంతాన లక్ష్మిగా అమ్మవారు

మహాచండీ దేవి.. పాహిమాం



శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో మహాచండీ దేవి

విజయవాడ కల్చరల్: దేవి శరన్నవరాత్రులు సోమవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. లోక పావని అభయ ప్రదాయని దుర్గమ్మను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో కంచిపీఠ సంప్రదాయాన్ని పాటిస్తూ శారదా మాతను మహాచండీ దేవిగా అలంకరించారు. భక్తులు కుంకుమ పూజను నిర్వహించారు. ఇదే ప్రాంగణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శివరామకృష్ణ క్షేత్రంలో కొలువైవున్న ముగ్గురమ్మలను అర్చక స్వాములు వైష్ణవీ గరుడ వాహిని, బాలా త్రిపుర సుందరి, సంతాన లక్ష్ములుగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ముత్యాలంపాడు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా పూజలు అందుకున్నారు. రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయంలో అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. దుర్గాపురంలో వీరమాచనేని కిషోర్ ఆధ్వర్యాన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి శ్రీ మహాచండీ దేవి అలంకారంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచనేని లలిత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో గుడిపాటి దత్తు ఆధ్వర్యాన అమ్మవారిని గౌరీదేవిగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గుడిపాటి సీతారామ్ తదితరులు పాల్గొని పూజలు చేశారు. అలాగే మధురానగర్ మెయిన్ రోడ్డు, మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం, జీవీఆర్ నగర్‌లో అమ్మవారిని శ్రీ మహాచండీ దేవిగా అలంకారం చేసి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలు కోలాటం చేశారు.

స్ఫూర్తికుటుంబం ట్రస్ట్ కార్యాలయంలో ..

మధురానగర్ స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ కోశాధికారి చొప్పరపు నారాయణరావు మాట్లాడుతూ బుధవారం అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి సరస్వతీ పూజ నిర్వహిస్తామని తెలిపారు. స్త్రీ శక్తి సోషల్ స్ఫూర్తి ట్రస్ట్ ప్రమీల, జోనల్ ఇంచార్జి రత్నకిశోర్ బాబు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు సోమవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. సాయినాథునికి కట్టుపొంగళి, ఆలసందలు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. లోక కల్యాణార్థం సాయినాథ, రుద్ర హోమం వేదపండితులచే జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా శ్రీ నృత్య కళాశాల, శ్రీవల్లీ బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యాన కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.